సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా 3
ఆదివారం, 15, జనవరి, 2023



వైభవంగా గోదాదేవి కల్యాణం

రంపచోడవరం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పాల్గొన్నారు.



కొనసాగుతున్న చలిగాలులు

- ఉదయం11గంటలవరకు వీడని మంచు తెరలు

4లో

16,272 టన్నుల ధాన్యం కొనుగోలు



రాజవొమ్మంగి: జిల్లాలో శనివారం నాటికి 2,900 మంది రైతుల నుంచి 16,272 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు సివిల్ సప్లయిస్ డీఎం గణేష్‌కుమార్ తెలిపారు. దీని విలువ రూ.33 కోట్లని చెప్పారు.

పల్లెవించిన సంతోషాలు

మన్యం ముంగిట సంబరాలు హోరెత్తాయి. సూర్యోదయానికి ముందే ప్రతీ పల్లెలో వెలుగులు విరజిమ్మాయి. తెల్లవారుజామునే భోగి మంటలతో ప్రకృతికి హారతి పట్టిన గిరిజనులు.. ఆ ఆనందం కాంతుల్లో సంక్రాంతి సందళ్లకు శ్రీకారం చుట్టారు. శంకుదేవుడికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు థింసా నృత్యాలు,తుడుము,దప్పు వాయిద్యాలతో సంబరాలు ప్రారంభించారు. హరిదాసులు, బుడబుక్కలు,గంగిరెద్దుల వారు తమ ఆటపాటలు, విన్యాసాలతో ఇంటింటా సందడి చేశారు. రంగురంగుల ముగ్గుల నడుమ ముగ్ధమనోహరంగా పల్లె పడతి సాక్షాత్కరించింది. ఘుమఘుమలాడే పిండి వంటల మధురవాసనలతో పాటు కొత్తబట్టల సుగంధాల పరిమళాలు మన్యమంతా వ్యాపించాయి. సామాన్యుడి నుంచి ఎంపీ,ఎమ్మెల్యేల వరకు అందరూ శనివారం జరిగిన ఈ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. పిల్లలు, పెద్దలు అన్న తేడాలేకుండా సంతోషాల్లో మునిగి తేలుతున్నారు.



వై.రామవరంలో బసవన్న విన్యాసం

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈ ఏడాది సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండగలో పూజకు ఉపయోగించే అడ్డాకులు, అడ్డకాయలను గిరిజనులు ముందుగానే అడవి నుంచి సేకరించారు. శనివారం ఉదయాన్నే గ్రామ పొలిమేర రోడ్డు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరకులోయ ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు కొయ్యూరు మండలంలో గిరిజనులకు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పాడేరు,రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,నాగులాపల్లి ధనలక్ష్మిలు సంక్రాంతి పండగలో పాల్గొన్నారు.



యండపల్లివలసలో వేషధారణలో సందడి చేస్తున్న గిరిజనులు

నూతన ఒరవడికి నాంది పలకాలి

ముంచంగిపుట్టు: పాత ఆలోచనలను భోగి మంటల్లో వేసి నూతన ఒరవడికి నాంది పలకలాని ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండల కేంద్రంలోని తన నివాసం వద్ద జెడ్పీ చైర్ పర్సన్ భోగి ఉత్సవాల్లో పాల్గొన్నారు. భర్త మూర్తి, కుటుంబ సభ్యులు,బంధువులతో కలిసి రంగవల్లుల మధ్య భోగి మంట వేసి, థింసా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతిని అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

దప్పు వాయించి... నృత్యం చేసి

హుకుంపేట: మండలంలోని గడికికుంచుమండ గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ భోగి మంట వద్ద కాసేపు డప్పు వాయించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి థింసానృత్యం చేశారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొనడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బంసుగుడలో ...

అరకులోయ రూరల్: మండలంలోని బస్కీ పంచాయతీ బంసుగుడ గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు, శైలజ దంపతులు పాల్గొన్నారు. గిరిజన సంప్రదాయం ప్రకారం ఎస్టీ కమిషన్ చైర్మన్ దంపతులు అడ్డకాయలను మోస్తూ కాసేపు గ్రామంలో తిరిగారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, మాజీ సర్పంచ్ చిన్నరావు,పరశురాం,భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బుడియాల సందడి: పద్మాపురం పెదలబుడు, గన్నేల,బొండం,లోతేరు,బస్కి,మాడగడ, సుంకరమెట్ట తదితర పంచాయతీల్లోని గ్రామాల్లో బుడియాల వేషధారణలో పలువురు సందడి చేశారు. పండగలు జరిగే సమయంలో కొంతమంది వివిధ వేషధారణల్లో ఇంటింటికీ తిరిగి నృత్యాలు చేస్తూ,పాటలు పాడుతూ బియ్యం, నగదు సేకరిస్తారు. వాటితో సన్నిహితులతో కలిసి గ్రామ పొలిమేరల్లో విందు భోజనాలు నిర్వహిస్తారు.



అడ్డకాయలు మోస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



ముంచంగిపుట్టులో భోగి మంట వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,మూర్తి దంపతులు



కడికించుమండలో దప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం



మహారాణిపేట(విశాఖ దక్షిణ) : వైద్య ఆరోగ్యశాఖలో వైద్యులు, ఇతర పోస్టులను కాంట్రాక్టు పద్ధతితోపాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 21లోగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో (రేసవానిపాలెం) అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వర రావు శనివారం తెలిపారు. పిడియాట్రిక్స్ (5 పోస్టులు, కేజీహెచ్, డీహెచ్ అనకాపల్లి, డీహెచ్ పాడేరు), స్పెషల్ ఎడ్యుకేటర్ (ఒకపోస్టు, డీహెచ్ అనకాపల్లి), ఫ్రెండ్లీ హెల్త్ కౌన్సెలర్ (6 పోస్టులు, నర్సీపట్నం, యలమంచలి, చోడవరం, పాడేరు, చింతపల్లి, అరకు), ఆస్పత్రి అటెండర్ (ఒక పోస్టు, నర్సీపట్నం), శానిటరీ అటెండర్ (2 పోస్టులు అనకాపల్లి, నర్సీపట్నం), సైక్రియాటిస్టు (ఒక పోస్టు, నర్సీపట్నం), మెడికల్ ఆఫీసర్ (13 పోస్టులు, పాత రేసవానిపాలెం, నమ్మిదొడ్డి, సిద్దేశ్వరం, చిన ముషిడివాడ, పెందుర్తి, ఆర్‌జీకే హౌసింగ్ కాలనీ, న్యూగాజువాక, గొల్లవీధి (అనకాపల్లి జిల్లా), ములగాడ, రంగిరీజు వీధి, నక్కవానిపాలెం, మారికవలస, సోమలింగపాలెం,) క్లినికల్ సైక్రియాటిస్టు (ఒక పోస్టు, పాడేరు), డెంటల్ టెక్నికల్ (ఒక పోస్టు,పాడేరు), భర్తీ చేస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి విద్యార్హత ధ్రువపత్రాలతోపాటు ఒక జత జిరాక్సు కాపీలను ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కాఫీ రైతు హ్యాపీ

కాఫీ, రాజ్‌మా ధరలు రైతుల మోముల్లో దరహాసం పండించాయి. గతంలో ఎన్నడూలేని విధంగా అధిక ధరకు జీసీసీ కొనుగోలు చేస్తుండడంతో ఈ ఏడాది తమ పంటపండిందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రాజ్‌మాకూ గిట్టుబాటు ధర
- తప్పిన దళారుల బెడద
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరి రైతులు



చింతపల్లి: గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీకి ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ మంచి ధరలు ప్రకటించింది. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దళారి వ్యవస్థను పూర్తిగా రూపుమాపాలని సర్కార్ సంకల్పించిన నేపథ్యంలో జీసీసీ అందుకు అనుగుణంగా వివిధ రకాల ఉత్పత్తులతో పాటు కాఫీకి అదిరేటి ధరలు ప్రకటించింది. ముఖ్యంగా అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా కాఫీ పార్చిమెంట్‌ను కిలో రూ.270, చెర్రి కిలో రూ.135కు కొనుగోలుస్తోంది. జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రైతులు కాఫీని ప్రధాన వాణిజ్య పంటగా సాగుచేస్తున్నారు.సుమారు రెండు లక్షల ఎకరాల్లో సాగు అవుతున్న తోటల నుంచి దాదాపు 71 వేల మెట్రిక్ టన్నుల పండ్ల దిగుబడివస్తుంది. సుమారు 13 వేల మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీ తయారు చేసి రైతులు విక్రయిస్తుంటారు. గతంలో గిరిజన రైతులు కాఫీ విక్రయాలకు దళారులపై ఆధారపడేవారు. వారు నిర్ణయించిన ధరలకే అమ్ముకుని నష్టపోయేవారు. వ్యాపారులు ఒక్కో గ్రామానికి ఒక్కో ధర నిర్ణయించేవారు. ఈ సీజన్‌లో అధిక ధరలు ప్రకటించిన జీసీసీ అధికారులు గ్రామాల్లో రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు జీసీసీ వైపు మొగ్గు చూపుతున్నారు. దళారుల హవా తగ్గుతోంది. చింతపల్లి డివిజన్ పరిధిలో 450 మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు చేయాలని జీసీసీ లక్ష్యంగా నిర్ణయించింది.

కాఫీ, రాజ్‌మా సరాసరి ధరలు (రూ.ల్లో)

సంవత్సరం	కాఫీ చెర్రీ	కాఫీ పార్చిమెంట్
2020-21	110.00	220.00
2021-22	90.00	190.00
2022-23	135.00	270.00
	రాజ్‌మా ఎరుపు	**రాజ్‌మా తెలుపు**
2020-21	65.00	80.00
2021-22	65.00	80.00
2022-23	75.00	90.00

అదిరేలా రాజ్‌మా ధర

మన్యం సిరుల పంటగా పేరొందిన రాజ్‌మా చిక్కుళ్లను జీసీసీ అధిక ధరకు కొనుగోలుచేస్తోంది. ఎరుపు చిక్కుళ్లు కిలో రూ.75, తెలుపు చిక్కుళ్లు రూ.90కు కొనుగోలు చేస్తోంది. రాజ్‌మా చిక్కుళ్లకు ఇంతటి ధరలు మునుపెన్నడూ లభించలేదని గిరిజన రైతులు చెబుతున్నారు. గిరిజనులు పండించిన రాజ్‌మాకు దక్షిణ భారత దేశంలో మంచి డిమాండ్ ఉంది. వీటిని కూడా ఎక్కువగా దళారులే కొనుగోలు చేసేవారు. తప్పుడు కాటాలు, తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండడంతో నష్టపోతున్న రైతులు ఇప్పుడు జీసీసీ ప్రకటించిన ధరలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీసీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం జీసీసీ ద్వారా అందిస్తున్న సేవలు గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కాఫీ, రాజ్‌మాకు మంచి ధరలు అందిస్తున్నాం. దళారులకు విక్రయించి మోసపోవద్దు.

– సింహాచలం, జీసీసీ డీఎం, చింతపల్లి


మంచి ధరలు ప్రకటించారు



కాఫీకి జీసీసీ మంచి ధరలు ప్రకటించింది. కిలో పార్చిమెంట్‌కు రూ.270 చెల్లిస్తోంది. చెర్రి రకాన్ని కిలో 135కు కొనుగోలు చేస్తోంది. తాము పండించిన కాఫీ పండ్లను మొత్తం జీసీసీకే విక్రయిస్తున్నాం.

– అబ్బాయినాయుడు, గొందిపాకలు,కాఫీ రైతు

బౌద్ధ మేళా రేపు


బొజ్జన్నకొండ

- బొజ్జన్నకొండపై ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న విదేశీ బౌద్ధ భిక్షువులు
- అదేరోజు తీర్థానికి పోటెత్తనున్న భక్తులు


కొండ ముఖద్వారం


లింగాల కొండపై చైత్యాలు

అనకాపల్లి టౌన్: కనుమ పండగ రోజు చారిత్రక విశేషాల సమాహారం బొజ్జన్నకొండ వైభవాన్ని కనులారా వీక్షించాలి. జిల్లాతోపాటు రాష్ట్రంలో పేరొందిన బొజ్జన్నకొండ తీర్థాన్ని సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 16న (సోమవారం) బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బౌద్ధ మేళాతోపాటు మధ్యాహ్నం నుంచి నిర్వహించే తీర్థానికి భారీ ఎత్తున జనం తరలి రానున్నారు. పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ బొజ్జన్న కొండకు పర్యాటక ప్రియులు వస్తున్నప్పటికీ వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆ దిశగా సంబంధిత అధికారులు ఇక్కడ పర్యటించారు.

చారిత్రక నేపథ్యం...

చారిత్రక అవశేషాలకు తోడు, దేశంలోనే ఒక ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన బొజ్జన్నకొండ అనకాపల్లి మండలం శంకరం రెవెన్యూలో ఉంది. బొజ్జన్నకొండ తీర్థం రోజునే దేశ, విదేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు బౌద్ధమేళా నిర్వహించడంతో ఈ తీర్థానికి మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. బొజ్జన్న కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పలువురు మంత్రులు సైతం హామీ ఇచ్చినా, 1958 నుంచి పురావస్తు చట్టం దీనికి గొడ్డలి పెట్టుగా మారింది. అయినప్పటికీ తీర్థం సందడిని కొనసాగిస్తూనే బౌద్ధమేళా నిర్వహించడం వల్ల కనుమ పండగ నాడు బొజ్జన్నకొండ కళకళలాడుతోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే బొజ్జన్నకొండ, లింగాల కొండల్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రస్తుతం చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పురావస్తు శాఖ నిబంధనలకు విఘాతం కలగకుండా బొజ్జన్నకొండకు విచ్చేసే పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించే ప్రక్రియ మొదలైంది. ఇక్కడకు తరచూ విదేశీయులు వస్తుంటారు. విశాలమైన పార్కు చూపరుల్ని ఆకట్టుకుంటోంది.

కొండకెళ్లే మార్గం...

బొజ్జన్న కొండకు చేరుకునేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. అనకాపల్లి–సబ్బవరం రహదారిలో శంకరం గ్రామానికి సమీపంలో జంక్షన్ నుంచి చేరుకోవచ్చు. ఏలేరు కాలువను ఆనుకొని తుమ్మపాల నుంచి మరొక రహదారి ఉంది. బొజ్జన్నకొండ తీర్థం రోజున ఈ రెండు మార్గాలు తీర్థ ప్రియులతో జన సంద్రంగా మారుతాయి.


కొండ వద్ద పార్కు

శాంతి ర్యాలీ

కనుమ రోజు (సోమవారం) ఉదయం 9.30 గంటలకు బౌద్ధ పతాకావిష్కరణ చేస్తారు. కొండ ప్రవేశ మార్గం ద్వారా కొండపై ప్రధాన స్థూపం వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్టు విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య కన్వీనర్ గొంది నవీన్ తెలిపారు.

కొనసాగుతున్న చలిగాలులు

ఉదయం 11 గంటల వరకు వీడని మంచు తెరలు


కొయ్యూరులో దట్టంగా కమ్ముకున్న మంచు


రంపచోడవరంలో కురుస్తున్న మంచు

సాక్షి, పాడేరు: జిల్లాలో చలిగాలులు తీవ్రంగా వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం ఉదయం 11గంటల వరకు మంచు తెరలు వీడలేదు. మంచు దట్టంగా కురవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 10డిగ్రీలు, అరకులోయలో 11.9డిగ్రీలు,చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 12.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మన్యంలో మంచు పరదాలు

రాజవొమ్మంగి: మన్యం వాసులపై చలిపులి గతంలో ఎన్నడూ లేనంత ప్రభావం చూపుతోంది. పగలు, రాత్రి ఒకే రకంగా చలి వణికిస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిళ్లు మంచు వాన కురుస్తోంది. ఉదయం 11 గంటలైనా మంచుతెరలు వీడడం లేదు. వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లైట్ల వెలుతురులో ప్రయాణం సాగిస్తున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. శివారు గ్రామాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి.

కమ్మేసిన పొగమంచు

కొయ్యూరు: మండల కేంద్రంలో శనివారం 9గంటల వరకు పొగమంచు కమ్మేసింది. ఇటీవల ఇంత ఎక్కువగా పొగమంచు కురవడం ఇదే ప్రథమని స్థానికులు చెబుతున్నారు.

ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో రాకపోకలు చాలాసేపు నిలిచిపోయాయి. కాకరపాడు నుంచి కొయ్యూరు, రాజేంద్రపాలెం గ్రామాల్లో పొంగమంచు ఎక్కువగా కురిసింది. చలికితోడు పొగమంచు రావడంతో చాలా మంది ఇబ్బంది పడ్డారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఆటో డ్రైవర్ దుర్మరణం

యలమంచిలి: మండలంలో 16వ నంబరు జాతీయ రహదారిపై రేగుపాలెం కూడలి వద్ద శనివారం ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ దువ్వాడ మోహన్‌కుమార్ దుర్మరణం చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. తుని నుంచి యలమంచిలి వైపు వస్తున్న ఆటో రేగుపాలెం కూడలి వద్ద యూటర్న్ తీస్తుండగా, అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోడ్రైవర్ మృతి చెందగా, మరో ప్రయాణికుడు పూడి పైడికొండ గాయపడ్డాడు. మృతుడిది రాంబిల్లి మండలం రజాల గ్రామం అని రూరల్ ఎస్సై సన్నిబాబు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి మృతి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఉడ్‌పేట సాయి ప్రియ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సంతోష్(34) సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. సంతోష్ అవివాహితుడు. తల్లిదండ్రులు ఇంటిలో లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పూర్తి వివరాల కోసం పట్టణ పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట: జి.భీమవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్ఐ ఆది నారాయణరెడ్డి తెలిపిన వివరాలు.. రాంబిల్లి మండలం కొత్తూరుకు చెందిన చిరంజీవి, కణితి బ్రహ్మాజీ కస్నూరుపాలెం వెళ్లి బైక్‌పై వస్తుండగా జి.భీమవరం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. 108లో అనకాపల్లి ఆస్పత్రికి తరలించి, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం

- ప్రత్యేకాలంకరణలో అమ్మవారు
- భారీగా తరలివచ్చిన భక్తజనం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం భోగి రోజున ఉపమాకలో గోదాదేవి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. శ్రీరంగనాథుడిని వివాహమాడ డం కోసం గోదాదేవి నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించింది. ఈ దీక్ష భోగి పండగతో ముగిసింది. స్వామి ఆమె దీక్షకు మెచ్చి వివాహమాడడానికి అంగీకరించినట్లు పురాణ కథనం. ఈ ఘట్టాన్ని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ అర్చకస్వాములు కృష్ణమాచార్యు లు, పి.వి.శేషాచార్యులు స్వామివారి పుష్ప తోటలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం కొండపై మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, స్వామివారి ఉత్సవ ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారిని అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఆచారాలు, వైష్ణవ సంప్రదాయం ప్రకారం 30వ పాశురం విన్నపం చేసి, స్వామివారి పుష్పతోటలో గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిష్వత్, రక్షా బంధనం, కల్యాణ మండప బలిహరణ, యజ్ఞోపవీతధారణ, రుత్విక్వరుణ (స్వామివారికి అనువైన కన్య కోసం 8 మంది పెద్దలు వెతికే ఘట్టం) జరిపారు. అనంతరం స్వామివారికి పాద ప్రక్షాళన, కన్యాదానం, కట్నాలు, శుభముహూర్తం, మంగళ సూత్రధారణ, ఆశీర్వచనాలు నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థగోష్టి, ప్రసాద వినియోగంతో గోదాదేవి కల్యాణం ముగించారు. అనంతరం శ్రీదేవీ భూదేవీ సమేతుడైన స్వామివారిని పుణ్యకోటి వాహనంలోనూ, అమ్మవారిని రాజాధిరాజ వాహనంలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. అర్చక స్వాములు రాజగోపాలాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, ఎస్.సి.హెచ్.శ్రీనివాసాచార్యులు, తరిగొండ వెంగమాంబ సాహిత్యపీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి, శ్రీనివాస భక్తసమాజం సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.


గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. శరభన్నపాలెంలో స్వగృహం వద్ద శనివారం మల్లవరం,గోపవరం,చిట్టింపాడు గ్రామాలకు చెందిన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదన్నారు.

ఈ కార్యక్రమంలో నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకులు కె.శివప్రసాద్, జెడ్పీటీసీ వారా నూకరాజు,డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు,స్థానిక సర్పంచ్ కిముడు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు గొడ్డేటి మహేశ్, నేతల ఉల్లి రామ్మూర్తి, సురేష్ పట్నాయక్,గాంధీ పాల్గొన్నారు

విహార యాత్రలో విషాదం

- తంతడి బీచ్‌లో ఇద్దరు గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- ఢిల్లీకి చెందిన యువకుడి కోసం గాలింపు

పరవాడ: బీచ్ అందాలను చూసేందుకు వెళ్లిన ఇరు కుటుంబాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు తంతడి తీరంలో గల్లంతైన ఘటన శనివారం సాయంత్రం చోటుచేసుకొంది. వారిలో అనకాపల్లికి చెందిన కడలి లీలా ప్రశాంత్ (30) మృతదేహం లభ్యం కాగా ఢిల్లీకి చెందిన లక్ష్యవర్మ (14) ఆచూకీ లభ్యం కాలేదు. పరవాడ ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు.. అనకాపల్లి రాణిగారి పూలతోటకు చెందిన లీలా ప్రశాంత్ కుటుంబానికి ఢిల్లీకి చెందిన రేణుక కుటుంబంతో ఫేస్ బుక్ ద్వారా కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రేణుక తన చెల్లి కుమారుడైన లక్ష్యవర్మను వెంటబెట్టుకొని రెండు రోజుల క్రితం అనకాపల్లిలో లీలా ప్రశాంత్ ఇంటికి వచ్చారు. రెండు రోజులుగా వీరంతా విశాఖ పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. లీలాప్రశాంత్ తన తల్లి సూర్యకళ, తండ్రి సత్యనారాయణ, స్నేహితులు రేణుక, ఆమె చెల్లి కుమారుడైన లక్ష్య వర్మను వెంటబెట్టుకొని శనివారం సాయంత్రం ఆటోలో అచ్యుతాపురం మండలం తంతడి బీచ్‌కు వచ్చారు. లక్ష్యవర్మ, లీలా ప్రశాంత్ నీటిలోకి దిగి స్నానం చేస్తున్నారు. పెద్ద అలలు వచ్చి లక్ష్యవర్మను లోపలికి ఈడ్చుకుపోయాయి. ఆ యువకుడిని కాపాడేయత్నంలో లీలా ప్రశాంత్ కూడా కొట్టుకుపోయాడు. స్థానిక యువకులు కొందరు సముద్రంలో కొట్టుకుపోతున్న లీలా ప్రశాంత్‌ను కాపాడి ఒడ్డుకి చేర్చినా ఫలితం దక్కలేదు. అప్పటికే అతను మృతి చెందాడు. గల్లంతైన లక్ష్య వర్మ జాడ తెలియరాలేదు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపు చర్యలకు అవరోధం ఏర్పడింది. లభ్యమైన లీలా ప్రశాంత్ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. ఇరు కుటుంబాల సభ్యులు తీరం వద్ద బోరున విలపిస్తున్న తీరు స్థానికులను కంట తడిపెట్టించింది. కేసును పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వర్రావు దర్యాప్తు చేస్తున్నారు.


లీలా ప్రశాంత్ మృతదేహం